క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొల్లిపర పద్మజ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

జూదరుల అరెస్టు

రేపల్లె: పేకాట ఆడుతూ ఐదుగురు పట్టుబడిన ఘటన మండలంలోని పిరాట్లంక గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. చోడాయపాలెం ఎస్‌ఐ శివప్రసాద్ కథనం మేరకు పిరాట్లంక గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందటంతో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. దాడులలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.1,210 స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని వివరించారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

చుండూరు(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 100 రోజుల పని కల్పించాలని ఎంపీపీ జాలాది రూబేను చెప్పారు. చుండూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. అధికారులతో ఆయా శాఖలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి వ్యక్తికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు పూర్తిగా సహకరించాలని కోరారు. వేసవిలో మంచి నీటి సమస్య లేకుండా అధికారులు చూడాలని ఆయన ఆదేశించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు వెంటనే వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆళ్ల వెంకట రమణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరరావు, శ్రీనివాసరెడ్డి, వెంకట రమణ, సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, విజయభాస్కర్, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు

టిప్పర్ సీజ్


టిప్పర్‌ను సీజ్ చేసిన ఎస్‌ఈబీ అధికారులు

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు గుర్తించి సీజ్ చేశారు. తెనాలి మండలం కొలకలూరు వద్ద గుంటూరు–హనుమాన్‌పాలెం రహదారిపై బుధవారం తెనాలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది ఆకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టారు. ఎటువంటి బిల్లులూ లేకుండా 35 టన్నుల ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేశారు. తదుపరి చర్యల కోసం రూరల్ పోలీసులకు అప్పగించారు. అలానే అధిక లోడుతో వెళ్తున్న మరో టిప్పర్ యజమానికి రూ.10 వేల జరిమానా విధించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెనాలి రూరల్: రోడ్డు వెంబడి మృతి చెంది పడి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. తెనాలి పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రోడ్డు వెంబడి సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. అతను ఎర్ర చొక్కా, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు. గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారమివ్వగా, వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి రూరల్: యువకుడి మృతి కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు కేసు వివరాలను వెల్లడించారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన పొన్నెకంటి సోమసుందర్(22)పై అదే గ్రామానికి చెందిన కొందరు పాత కక్షల నేపథ్యంలో దాడి చేశారు. మనస్తాపానికి గురైన అతను గత నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే నెల 16న మృతి చెందాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కొలకలూరుకు చెందిన గాజులవర్తి ప్రేమ్‌సాగర్‌పై మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ముంగిళ్లలోకే సంక్షేమ పథకాలు

- అన్ని వర్గాలకూ ఆనందం
- ఎమ్మెల్యే కోన రఘుపతి
- చింతాయపాలెం, గణపవరంలలో గడప గడపకు మన ప్రభుత్వం


చింతాయపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి ముంగిటకే తెచ్చి అందజేయిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. కర్లపాలెం మండలంలోని చింతాయపాలెంలో బుధవారం ఉదయం, గణపవరం గ్రామంలో సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కోన రఘుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో ఆయా పార్టీల వారికే సంక్షేమ పథకాలు మంజూరయ్యేవని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత గ్రామ వలంటీర్లను నియమించి అర్హులైన వారిని వెతికి మరీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలోనూ ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయించటంతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. తమ పార్టీకి ఓటు వెయ్యని వారికి కూడా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నామని కోన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాతంశెట్టి లక్ష్మణరావు, దిండి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, సొసైటీ చైర్మన్ పెద వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎలీషాబాబు, పార్టీ నాయకులు కూచిపూడి శ్యామ్యూల్ జాన్, తోట వెంకటరమణ, మరకా శ్రీనివాసరావు, కాగిత మహేష్, పెరుగు శ్రీనివాసరావు, పి.నాగరాజురెడ్డి, దేవరకొండ రమేష్, రవి కుమార్, పి.స్వామిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున


తిప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి మేరుగ

చుండూరు(భట్టిప్రోలు): వైఎస్సార్ సీపీ చుండూరు మండల కన్వీనర్, మున్నంగివారిపాలెం సర్పంచ్ తిప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని, అటువంటి వ్యక్తి మరణం పార్టీకి తీరని లోటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం మున్నంగివారిపాలెంలోని శ్రీనివాసరెడ్డి సంస్మరణ కార్యక్రమానికి మంత్రి విచ్చేశారు. తిప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి భక్తుడిగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైనికునిగా నిరంతరం పార్టీ కోసం శ్రీనివాసరెడ్డి శ్రమించారని కొనియాడారు. మూడు పర్యాయాలు గ్రామ సర్పంచ్‌గా పని చేసిన శ్రీనివాసరెడ్డి అకాల మరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో చుండూరు సర్పంచ్ ఉయ్యూరి అప్పిరెడ్డి, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీపీ జాలాది రూబెన్, దాట్ల మోహన్‌రెడ్డి, దాది వెంకట సుబ్బారావు, హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండా శివప్రసాద్ రెడ్డి, వేటపాలెం, వలివేరు సర్పంచులు కంఠమనేని శ్రీనివాసరావు, పందిపాటి ఏసు(పెద్దబ్బాయి), ఎంపీటీసీ సభ్యులు అమృతలూరి ప్రవీణ్ పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మనుస్మృతిని రాజ్యాంగంతో పోల్చడం సరికాదు


మను స్మృతి గ్రంథ ఆవిష్కరణ వాల్ పోస్టర్లు దహనం చేస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: హైదరాబాద్‌లో ఈనెల 15న నిర్వహిస్తున్న మను స్మృతి గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం శివారు మండేవారిపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మను స్మృతి గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను దహనం చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శరత్ మాట్లాడుతూ మను స్మృతిని ప్రాచీన భారతదేశ రాజ్యాంగం అని పోల్చడం సరికాదని, ఇది సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పి.మోషె, డేవిడ్, ఎం.వంశీ, రాహుల్, నితిన్, సన్నీ, రవితేజ పాల్గొన్నారు.

కర్లపాలెం మాజీ సర్పంచ్ ఏసేబు మృతి



కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్ బొద్దుకూరి ఏసేబు(70) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మేజర్ పంచాయతీ కర్లపాలెం అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఏసేబుకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏసేబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భౌతికకాయానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

వాహనాల వేలం


ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

నగరం: సారా, అక్రమ మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలకు నిర్వహించిన బహిరంగ వేలంపాటలో 21 వాహనాలను పాటదారులు దక్కించుకున్నారని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు చెప్పారు. నగరంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వాహనాలకు వేలం పాట నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వివిధ కేసులలో 25 వాహనాలను సీజ్ చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటికి బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో 21 వాహనాలను రూ.3.72 లక్షలకు పాటదారులు దక్కించుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన 4 వాహనాలకు పాటదారులు ఎవరూ ముందుకు రాలేదని వివరించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ సాయికిరణ్

తెనాలిటౌన్: ఒంగోలులో ఈనెల 12న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రూరల్ మండలం కఠెవరంలోని నివాస్ షిటో అకాడమీ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు కోచ్ కె.సాయికిరణ్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులకు ఇంటర్నేషనల్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ సుదర్శన్ చేతుల మీదుగా మెడల్లను అందించినట్లు తెలిపారు. పోటీలలో అకాడమీ విద్యార్థులు పి.హరినారాయణ రాజు, సాత్విక్, కార్తీక్, రాకేష్ బంగారు పతకాలు సాధించారని, కె.పల్లవి, రిషిక, విజయ్, సుశాత్ రాజు వెండి పతకాలను సాధించారని వివరించారు. ఈ నెల 19న మచిలీపట్నంలో జరిగే ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలలో విద్యార్థులు పాల్గొంటున్నట్లు కోచ్ చెప్పారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు చింతాయపాలెం విద్యార్థులు


జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

చింతాయపాలెం(కర్లపాలెం): పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. సైక్లింగ్ క్రీడాకారులకు బుధవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 13 వరకు నరసరావుపేటలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో తమ పాఠశాల క్రీడాకారులు అండర్–17 బాలికల విభాగంలో పులి పల్లవి, పిట్టు అనూరాధ బంగారు పతకాలు, ఎస్‌కే జాస్మిన్ కాంస్య పతకం, అండర్–17 బాలుర విభాగంలో కుంచాల పృథ్వి రెడ్డి కాంస్య పతకం, అండర్–19 బాలుర విభాగంలో కుంచల భాను కాంస్య పతకం సాధించి జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మేనెలలో జాతీయ స్థాయిలో జరగనున్న పోటీలలో తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు.

మహిళలు, బాలికలకు క్లాత్ పెయింటింగ్ వర్క్‌పై శిక్షణ


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ శేషాచలం

తెనాలిటౌన్: ఆర్యవైశ్యుల్లోని మధ్యతరగతి మహిళలు, బాలికల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం పేర్కొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు క్లాత్ పెయింటింగ్ వర్క్‌పై శిక్షణ తరగతులను బుధవారం బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులను శేషాచలం ప్రారంభించి మాట్లాడుతూ మహిళలకు ప్రయోజనకరమైన పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తున్నామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో ఆర్యవైశ్య సంఘం ద్వారా లీగల్ సెల్‌ను ఉచితంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శిక్షణను కూరపాటి శ్రీలక్ష్మి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, కౌన్సిలర్ గడవర్తి సాయిహరేరామ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొల్లా గురునాథగుప్తా, అతుకూరి పూర్ణచంద్రరావు, తూనుగుంట్ల సుబ్బారావు, కర్పూరపు రఘునాథ గుప్తా, మహిళా సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, కార్యదర్శి ఆలమూరి పూజ, కోశాధికారి ఆకీ గోవర్ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ బాబురావు, ఆరోగ్య సిబ్బంది

కొల్లిపర: సైకిల్ వ్యాయామం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని పొందవచ్చని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొత్తపల్లి బాబురావు చెప్పారు. సైకిల్ వ్యాయామం–క్యాన్సర్ తగ్గుదల అనే అంశంపై మున్నంగి గ్రామంలో అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. డాక్టర్ బాబురావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డి.స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, పీహెచ్ఈఎన్ కోటేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు బి.రమేష్, ఉపాధ్యాయులు సాంబశివరావు, పఠాన్, ఆలీఖాన్, హెల్త్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు, ఏఎన్ఎం కుసుమ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవం


సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లంబాడ సంక్షేమ సేవా సంఘ నాయకులు

తెనాలిటౌన్: పట్టణంలోని చినరావూరులో జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవం నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భవానీ అమ్మవారి గుడి ప్రాంగణంలో భోగ్ బండార్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు ధారవత్ ప్రసాద్ నాయక్, కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేతావత్ మోతిలాల్, ఉపాధ్యక్షులు ఇస్లావత్ కృష్ణనాయక్, ధావియా నాయక్, కార్యదర్శి రాములు నాయక్, బాలాజీ నాయక్, సహాయ కార్యదర్శి బాలకృష్ణనాయక్, లక్ష్మణ్ నాయక్, కోశాధికారి కేశావత్ లక్ష్మణ్ నాయక్, కమిటీ సభ్యులు తండా నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రికి బాలకోటయ్య ముస్తాబు

- 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం
- కోరిన కోర్కెలు తీర్చే వరాల స్వామిగా పేరు
- రేపటి నుంచి తిరునాళ్లు ప్రారంభం


తిరునాళ్లకు ముస్తాబైన బాలకోటేశ్వరస్వామి దేవస్థానం


బాలకోటేశ్వరస్వామి మూలవిరాట్

రేపల్లె: మహాశివరాత్రిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. జిల్లాలో ప్రాధాన్యం సంతరించుకున్న ఆలయాల్లో రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలోని శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం ఒకటి. ఇక్కడి తిరునాళ్లకు ఎంతో పేరుంది. మూడురోజులపాటు జరిగే ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తుల కోసం దేవదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఆలయాన్ని ముస్తాబు చేసింది. విద్యుద్దీప అలంకరణ చేసే పనులు ప్రారంభించింది. తిరునాళ్ళకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దర్శనం, మొక్కుబడుల చెల్లింపునకు వీలుగా బారీకేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. తలనీలాల సమర్పణ, ప్రసాదాలకు ప్రత్యేక కౌంటర్లు సిద్ధం చేశారు. 17న ప్రారంభమయ్యే ఉత్సవాల్లో పశుప్రదక్షణలు, అర్ధరాత్రి స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. 18న తిరునాళ్ల సందర్భంగా అభిషేకాలు, మొక్కుబడుల చెల్లింపు, పొంగళ్ల నివేదన, రుద్రాభిషేకం, జగజ్యోతి, మహానివేదన కార్యక్రమాలు జరుగుతాయి. 19న అభిషేక మహోత్సవాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎంతో ఘన చరిత్ర

బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి 300 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. దేవాలయం ఉన్న ప్రాంతంలో పూర్వం ఓ రైతు పొలాన్ని దుక్కి దున్నుతుండగా నాగలి కొర్రుకు శివలింగ ఆకారంలోని బండ తగిలిందట. దానిని ఆ రైతు పచ్చడి బండగా భావించి ఇంటిలో ఉపయోగించడం ప్రారంభించాడట. కొన్ని రోజులకు గుండ్రాయి నుంచి మంట శరీరమంతా మంట అని శబ్దం రావటంతోపాటు ఇంటిలోని వృద్ధురాలికి పూనకం వచ్చి 'నేను బాలకోటయ్యను శరీరమంతా మంట స్నానం చేయించండి. నాకు గుడి కట్టించండి'' అని పలికిందట. దీంతో రైతు సంబరపడి సమీపంలోని ఊలుపాలెం జమీందార్‌కు తెలియజేయగా అక్కడే ఉన్న నరసరావుపేట జమీందార్ రావు బహదూర్ విజయకృష్ణ గూండారావు జమీందార్ ఆలయాన్ని నిర్మించారని పెద్దలు చెబుతారు.

భక్తులకు అచెంచల విశ్వాసం

బాలకోటేశ్వరస్వామి అంటే ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల భక్తులకు అచెంచల విశ్వాసం ఉంది. ఆయనను దర్శించుకుంటే పెళ్లికాని వారికి వివాహాలవుతాయని, సంతానం లేని వారికి పిల్లలు కలుగుతారని నమ్ముతారు.

బాలకోటయ్య సన్నిధికి దారిలా..

రేపల్లె పట్టణం నుంచి అరవపల్లి 3 కిలోమీటర్లు ఉంటుంది. తిరనాళ్లను పురస్కరించుకుని 18న స్వామి ఆలయానికి రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆ శాఖ అధికారులు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు.

వెల్లటూరు శివాలయం సిద్ధం

రేపటి నుంచి కల్యాణ మహోత్సవాలు


భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని శివాలయం

వెల్లటూరు(భట్టిప్రోలు): శతాబ్దాల చరిత్ర కలిగిన భట్టిప్రోలు మండలం వెల్లటూరు బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి, గంగా పార్వతి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యారు. స్వామివార్ల త్రయాహ్నిక దీక్షా దివ్య కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం స్వామిని పెండ్లికుమారుడిగా చేయనున్నారు. రాత్రి ధ్వజారోహణ, శనివారం జగజ్యోతి, ఎదురుకోలు ఉత్సవం, స్వామి వార్ల కల్యాణోత్సం, రాత్రి నంది వాహనంపై గ్రామోత్సవం, 19న రథోత్సవం, 20న వసంతోత్సవం, రాత్రి ధ్వజావరోహణ, పుష్పయాగోత్సవం జరుగుతాయని ఈవో పేర్కొన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని శనివారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీసూక్త విధాన కుంకుమ పూజ జరుగుతుందని తెలిపారు.

వాహనాల్లో బ్యాటరీల చోరీ


బ్యాటరీ చోరీకి గురైన లారీని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

కొల్లూరు : లారీల్లో బ్యాటరీలు చోరీకి గురవుతున్న ఘటనలు వాహన యజమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో గృహాల వద్ద, రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన లారీలు, ఇతర వాహనాల్లోని బ్యాటరీల చోరీలు కొల్లూరులో ఇటీవల అధికమయ్యాయి. ఇటుక పరిశ్రమకు నిలయమైన కొల్లూరులో లారీలు అధిక సంఖ్యలో ఉండటంతోపాటు, బొగ్గు, ఊక, ఇసుక, వాణిజ్య పంటల తరలింపునకు ఇతర ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లు ఎక్కువగా వచ్చి పోతుంటాయి. కొల్లూరు పరిసర ప్రాంతాలలో రోడ్ల వెంబడి నిలిపి ఉంచిన లారీలను లక్ష్యంగా చేసుకుంటున్న చోరులు గుట్టుచప్పుడు కాకుండా బ్యాటరీలను తస్కరించి తరలించుకువెళుతున్నారు. మంగళవారం రాత్రి కొల్లూరులో ముస్లింల శ్మశాన వాటిక ప్రాంతంలో ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన లారీలో ఓ బ్యాటరీ, లాక్‌సెంటర్ పంటకాల్వ వద్ద గోడౌన్ వద్ద నిలిపి ఉంచిన మరో లారీలోని బ్యాటరీ చోరీకి గురయ్యాయి. వారం రోజుల వ్యవధిలో కొల్లూరు లాక్‌సెంటర్, కరకట్ట దిగువన నిలిపి ఉంచిన ఆరు లారీల్లో బ్యాటరీలు చోరీకి గురవ్వగా, ఇటీవల లారీలు, ట్రాక్టర్లు కలిపి సుమారు 20 వాహనాల్లో బ్యాటరీల దొంగతనాలు జరిగినట్టు సమాచారం.

పోలీసు స్టేషన్‌లోని వాహనాల బ్యాటరీలూ మాయం

సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచిన వాహనాల్లోని బ్యాటరీలూ చోరీకి గురవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఉదంతంపై పోలీసులు దృష్టి సారించారు. దొంగలను పట్టుకునేందుకు గస్తీ ముమ్మరం చేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి

తెనాలిటౌన్: క్షయ, హెచ్‌ఐవీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, ర్యాలీలు నిర్వహించడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి పేర్కొన్నారు. పట్టణ చెంచుపేటలోని ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా ఉన్న ప్రైవేట్ విద్యాభవనంలో సోమవారం ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సేవాసంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు గోరికపూడి బాలరాజు అధ్యక్షత వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ ఉమా ప్రణతి మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ రవిశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ లాంటి అనేక రకాలైన వ్యాధులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సమాజానికి, కుటుంబాలకు ఆదరణ కల్పించాల్సిన సమయంలో ఆదరణ సేవా సంస్థ సభ్యులు అవగాహన సదస్సులు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రెసిడెంట్ బాలరాజు మాట్లాడుతూ క్షయ, హెచ్‌ఐవీ తదితర వ్యాధిగ్రస్తులకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాణి, కో–ఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.